

సుర్రుమంటున్న సూరీడు..



- జిల్లాలో 43.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు
- ఆరెంజ్ హెచ్చరికలతో అప్రమత్తం
- ఉదయం 7 గంటల నుంచే సూర్య ప్రతాపం
- బయటకు రావాలంటేనే జంకుతున్న జనం
- సింగరేణి గనులపై పరిస్థితి తీవ్రం



జనసంచారం లేని మంచిర్యాల-లక్షెట్టిపేట జాతీయ రహదారి

మంచిర్యాల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. సూర్య ప్రతాపానికి ప్రజ లు విలవిల్లాడుతున్నారు. ఉదయం 7గంటలకే వాతా వరణం వేడెక్కుతుండటంతో ఇళ్లనుంచి బయటకు రావాలంటేనే జనం జంకుతున్నారు. ముఖ్యంగా పగటి పూట ఉష్ణోగ్రతలు గరిష్టస్థాయికి చేరుకుంటుండటం తో ఎండ వేడిమిని తాళలేక పోతున్నారు. వారం రోజు లుగా విపరీతమైన ఎండలతో ప్రజలు సతమత మవుతున్నారు. గడిచిన నాలుగైదు రోజులుగా జిల్లాలో సగటు ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు నమోదవుతుండడమే దీనికి కారణం.

క్రమేపీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు...

జిల్లాలో వారం రోజుల నుంచి ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతున్నాయి. ముఖ్యంగా పగటి వేళలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఏప్రిల్ లోనే ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతుండడం ఆందోళనకు రేకెత్తిస్తోంది. శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి సింగరేణి ఏరియాల్లో అండర్ గ్రౌండ్ బొగ్గు బావులతో పాటు ఓపెన్‌కాస్టు మైన్‌లు అధిక సంఖ్యలో ఉండడంతో ఇక్కడి వాతావరణం తీవ్రంగా వేడేక్కుతోంది. చిన్న చిన్న అవసరాలకు కూడా బయటకు వెళ్లలేక ప్రజలు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లాలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా అధిక ఉష్ణోగ్రతలతో ఉక్కపోతకు గురవుతుండగా సామాన్య జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాలపై బయటకు వెళ్లాలంటేనే ప్రజలు జంకాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

బొగ్గు గనుల్లో పరిస్థితి దయనీయం...

క్రమేపీ పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా సింగరేణి బొగ్గు గనుల్లో కార్మికుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. సెకండ్ షిఫ్టులో విధుల్లోకి వెళ్లే కార్మికులు ఎండల కారణంగా తీవ్రఇబ్బందులు పడుతు న్నారు. అలాగే మొదటి షిఫ్టుపూర్తి చేసుకున్న వారు సైతం మండుటెండలో ఇళ్లకు వెళ్లాల్సి వస్తోంది. సాధారణ..

(తరువాయి 7లో)

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

గర్మిళ్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ సూచించారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎండలు పెరుగుతున్నందున వడదెబ్బ తగిలే అవకాశం ఉందన్నారు. అత్యావసరం అయితేనే బయటకు రావాలన్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు, గర్భిణులు ఎండలో తిరగవద్దన్నారు. ఇప్పటికే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల్లో వైద్యులు, సిబ్బందిని అప్రమత్తం చేశామని, ప్రతి గ్రామంలో ఓఆర్‌ఎస్ డిపోను పెట్టామన్నారు. ప్రతి మండలంలో వడదెబ్బ నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వడదెబ్బ వివరలు తెలుసుకోవడానికి త్రిమెన్ కమిటీని ఏర్పాటు చేశామని స్థానిక వైద్యాధికారి, పోలీసు ఇన్‌స్పెక్టర్, తహసీల్దార్ కమిటీలో ఉంటారన్నారు. అన్ని శాఖలతో కలెక్టర్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్ మీటింగ్ ఏర్పాటు చేశామని, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ఘనంగా ఆవిర్భావ వేడుకలు

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని మార్క్స్‌భవన్‌లో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆవిర్భావ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి లాల్ కుమార్ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నూతన ప్రజాస్వామిక విప్లవమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. దేశంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పాలకులు ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని, ఎన్నికలప్పుడు హామీలు ఇచ్చి గెలిచిన తర్వాత మర్చిపోతున్నారన్నారు. ప్రతి ఒక్కరు కనీస సౌకర్యాలైన ఇల్లు, తిండి, బట్ట, చదువుకున్న వారికి ఉద్యోగం కావాలన్నారు. ప్రజలు, కార్మికులు, రైతుల హక్కులకోసం సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ అనేక పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లన్న, సురేందర్, జ్యోతి, అరుణ, చిన్నయ్య, రాజేశం, సయ్యద్ ఉన్నారు.

మావోయిస్టు కుటుంబానికి పోలీసుల చేయూత



మావోయిస్టు కుటుంబ సభ్యులకు సరుకులు అందజేస్తున్న సీఐ, ఎస్‌ఐ

కోటపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పారుపెల్లి గ్రామంలో అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు కుటుంబానికి మంగళవారం పోలీసులు చేయూ తనందించారు. మావోయిస్టు సెంట్రల్ జోన్ డివిజనల్ కమిటీ సెక్రటరీ ఆత్రం లచ్చన్న కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకులను చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్, ఎస్‌ఐ రాజేందర్‌లు అందించారు. అజ్ఞాతంలో ఉన్న లచ్చన్న అజ్ఞాతం వీడి జన జీవన స్రవంతిలోకి రావాలని కోరారు. లచ్చన్న కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని పేర్కొన్నారు. అజ్ఞాతంలో ఉన్న లచ్చన్నకు సంబంధించి ఆయన వదిన లచ్చక్కతో పాటు వారి కుమారుడు మాత్రమే పారుపెల్లిలో నివాసం ఉంటుండగా వారు అనారోగ్యంతో ఉన్నారని, అజ్ఞాతంలో ఉన్న లచ్చన్న జన జీవవన స్రవంతిలోకి రావాలని పోలీసులు కోరారు.

ప్రతీ రైతుకు భూభారతి చట్టాన్ని వివరించాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన చట్టంపై రైతులకు వివరించాలని రాష్ట్ర రెవెన్యూశాఖ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ భూభారతి చట్టంపై గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి అంశాల వారీగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అందులో పరిష్కరించడానికి వీలు ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ నెల 30 వరకు అవగాహన సదస్సులను పూర్తి చేయాలన్నారు. అలాగే ఇందిరమ్మ ఇండ్లనిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టంపై మండలల్లో అవగాహన సదస్సులు నిర్వహించేందుకు కార్యచరణ రూపొందించి ఈ ప్రకారంగా అవగాహనసదస్సులు నిర్వహించి రైతులను వివరిస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, హౌజింగ్ పీడీ బన్సీలాల్ అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలి



తోటి కులస్తులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

తాండూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు పరిష్కరించేందుకు కృషి చేయాలని ఉట్నూరు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రేచిని పంచాయతీ పరిధిలోని గజ్జలపల్లి హాబిటేషన్‌లోని తోటిగూడాన్ని సందర్శించారు. తోటి కులస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందుతున్న పథకాలు, గూడెంలోని సమస్యల గురించి తెలుసుకున్నారు. గ్రామంలో నీటి సమస్య తీర్చేందుకు కొత్త బోర్‌వెల్ ఏర్పాటు చేయాలని, భీమన్న దేవుని ఆలయం షెడ్డు నిర్మాణానికి, కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గజ్జలపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లలు ఎవరు లేకపోడంతో అంగన్‌వాడీ టీచర్‌ను మందలించారు. ఈ కార్య క్రమంలో తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్, ఏటీడీవో పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

భూ భారతితో సమస్యల పరిష్కారం

- కలెక్టర్ కుమార్ దీపక్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

కోటపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కొత్తగా అమలులోకి తెచ్చిన భూభారతి నూతన ఆర్‌వోఆర్ చట్టంతో భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భూభారతి నూతనచట్టంద్వారా రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించారని, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసేందుకు భూముల వివరాలను పూర్తిస్థాయిలో సర్వే చేస్తారన్నారు. సాదా బైనామా దరఖాస్తులను పరిష్కరించడంతో పాటు నిర్ణీత కాలంలో భూముల విరాసత్ చేసే అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మోతిలాల్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ రాఘవేంద్రరావు, ఎంపీడీవో లక్ష్మయ్య, డిప్యూటి తహసీల్దార్ నవీన్, రైతులు, పార్టీల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

సమస్యల శాశ్వత పరిష్కారానికే భూభారతి

భీమారం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : భూసమస్యల శాశ్వత పరిష్కారాని కే భూభారతి ఆర్‌వోఆర్ చట్టాని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని కలెక్టర్ కుమార్‌దీపక్ పేర్కొన్నారు. మంగళవారం భీమారం మండల కేంద్రంలోని రైతు వేదికలో భూభారతి చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి హాజరై మాట్లాడారు. ఈ చట్టంలో హక్కులు, రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించారన్నారు. ఈనెల 30 వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో సదస్సులు నిర్వహించి రైతులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఎంపిక చేసిన మండలంలో జూన్2 వరకు సమస్యలను పరిష్కరించి మిగిలిన మండలాల్లోని సమస్యలను గుర్తించి ఆగస్టు 15లోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్ రావు, జిల్లా వ్యవసాయాధికారి కల్పన, తహసీల్దార్ సదానందం, అధికారులు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో బాలికల హవా..

- జిల్లాకు 21వ స్థానం



7

24గంటల్లో చోరీ కేసును ఛేదించిన పోలీసులు

వివరాలు వెల్లడించిన డీసీపీ భాస్కర్



మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాలక్రైం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల కేంద్రం సీసీ నస్పూర్‌లో సోమవారం జరిగిన కేసును పోలీసులు 24గంటల్లోనే ఛేదించారు. చోరీకి సంబం ధించిన వివరాలను డీసీపీ భాస్కర్ మంగళవారం వెల్లడించారు. సీసీ పోలీసు స్టేషన్ పరిధిలోని కాకతీయ హిల్స్‌లో భూపెల్లి లావణ్య ఇంటికి తాళం వేసి ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులకొట్టి నగలు ఎత్తుకెళ్లారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించారు. మంచి ర్యాల పట్టణం గౌతమినగర్‌లో నివాసం ఉంటున్న నన్నపు రాజు చంద్రకాంత్ ప్రస్తుతం గౌతమ్‌నగర్‌లో అద్దెకుంటున్నారు. వృత్తి టీపాయింట్. కాని జల్సాలకు అలవాటుపడి ఈజీగా డబ్బులు సంపాదించాలనే దురుద్దేశంతో చోరీలకు పాల్ప డుతున్నాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీసీఎస్ పోలీసులు సీసీ కెమెరాల ద్వారా కేసు దర్యాప్తు చేయగా నన్నెపు రాజు చంద్రకాంత్ దొంగలించిన సొత్తును గోదావరిఖనిలో అమ్మేందుకు ద్విచక్రవాహనం పై వెళ్తుండగా తెలం గాణ తల్లి విగ్రహం వద్ద పట్టుబడ్డాడు. అతని వద్ద ఒక నల్లపూసల గొలుసు, బంగారి చైన్‌లు రెండు, ఒక జత మాటీలు, చంద్రహారం స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు 7తులాలు ఉంటుంది. బంగారంతో పాటు నిందితుని ద్విచక్రవాహనాన్ని స్వాధీన పరుచుకొని రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు. ఏసీపీ ప్రకాశ్‌తోపాటు రూరల్ సీఐ ఆకుల అశోక్, ఎస్‌ఐలు కమలాకర్, జితేందర్ సింగ్, ఎ. మధుసూదన్‌రావు, ఎస్‌ఐ సీపీఎస్ సిబ్బందిని ఈసందర్భం గా డీసీపీ అభినందించారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్టు

జన్నారం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మంచిర్యాల డీసీపీ భాస్కర్ తెలిపారు. మంగళవారం డీసీపీ కార్యాలయంలో నిర్వ హించిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. డీసీపీ మాట్లాడుతూ ఈ నెల 22న ఉదయం ఇందన్‌పల్లి అటవీ చెక్‌పోస్టు ప్రాంతంలో పోలీసులు తనిఖీలు చేస్తుండగా నలుగురు వ్యక్తులు బైక్‌లపై అనుమానస్పదంగా పారిపోయేందుకు ప్రయత్నించగా వారిని పట్టుకు న్నామన్నారు. పట్టుకున్న పొనకల్ గ్రామానికి చెందిన జునోజ్ రాజేష్, గాంధీనగర్‌కుచెందిన సయ్యద్ సమీర్,ఎనగందుల వినయ్, రేండ్లగూడకు చెందిన ఆకుల బాలాజీ, లను తనిఖీ చేయగా గంజాయి దొరికిందన్నారు. వీరిని విచారించగా కొమురంబీం ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి వద్ద రూ. 5 వేలకు కిలో పావు గంజాయిని కొనుగోలు చేసి తీసుకువచ్చి విక్రయిస్తున్నామని తెలిపినట్లు పేర్కొన్నారు. నిందితుల వద్ద కిలో పావు నిషేధిత గంజాయితో పాటు రూ. 50 వేల నగదు, రెండు బైక్‌లు, నాలుగులు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకున్న ఎస్‌ఐ రాజవర్ధన్, హెడ్ కానిస్టేబుల్ తుకారాం, గౌస్, పోలీసు సిబ్బంది సురేష్, మల్లేష్, శ్రీను, సంతోష్, వెంకటేష్‌లను డీసీపీ అభినందించారు. సమావేశంలో ఏసీపీ ప్రకాష్, సీఐ నరేందర్ పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఒకరికి జీవిత ఖైదు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ.60 వేల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్ మంగళవారం తీర్పు చెప్పారు. ఆసిఫాబాద్ సీఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (17) తన తల్లి మరణించడంతో తన నానమ్మ దగ్గర ఉంటుంది. అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ గెట్కర్ శ్రీకాంత్ బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని లైగింగ దాడికి పాల్పడ్డాడు. బాలిక గర్భం దాల్చడంతో శ్రీకాంత్‌ను కలిసి తనను వెంటనే పెళ్లి చేసుకోవాలని కోరింది. అందుకు అతడు తిరస్కరించారు. గ్రామంలో పెద్ద మనుషుల మధ్య పంచాయతీ నిర్వహించిన అతడు ఒప్పుకోలేదు. దీంతో సదరు బాధితురాలు ఆసిఫాబాద్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి అడిషనల్ ఎస్పీ అచ్చేశ్వర్‌రావు, సీఐ అశోక్ పోక్సో కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేసి కోర్టులో హాజరు పరచగా పీపీ జగన్మోహ న్‌రావు, సీడీఓ అండ్ లైజనింగ్ ఆఫీసర్ పిరాంసింగ్ సాక్షులను హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో నిందితుడు శ్రీకాంత్‌కు జీవితకాలం జైలు శిక్ష, రూ.60 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ఏఎస్పీ చిత్తరంజన్, సీఐ రవీందర్, పోలీసు సిబ్బందిని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అభినందించారు.

చోరీకి గురైన కంప్యూటర్లు లభ్యం

లింగాపూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయంలో చోరీకి గు రైన రెండు కంప్యూ టర్లు మంగళవారం పిట్టగూడ సమీపంలో వాగు వద్ద ఉండగా పోలీ సులు స్వాధీనం చేసుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ప్యాసింజర్ రైళ్లే దిక్కు

- ఆసిఫాబాద్ రోడ్డు రైల్వేస్టేషన్‌లో కలగానే ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్
- దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు తప్పని అవస్థలు

రెబ్బెన, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండల కేంద్రంలోని నిజాం కాలం నాటి ఆసిఫాబాద్ రోడ్డు రైల్వేస్టేష న్‌లో నియోజకవర్గ ప్రజలకు ప్యాసింజర్ రైళ్లేదిక్కువు తున్నాయి. ప్రధాన రైళ్లకు ఇక్కడ హాల్టింగ్ ఇవ్వాలని ప్రజా ప్రతినిధులు రైల్వే శాఖ అధికారులకు, ఉన్నతాధికారులకు వి నతి పత్రాలు సమర్పించినప్పటికీ బుట్టదాఖలావుతున్నాయి. జిల్లా కేంద్రంతో పాటు దూర ప్రాంతాల నుంచి సింగరేణిలో ఉద్యోగం చేస్తున్న కార్మిక కుటుంబాలు ఎక్కువ శాతం రైళ్లలో రాక పోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో రైల్వేస్టే షన్‌ను అభివృద్ధి చేసి మరిన్ని రైళ్లను నిలుపాల్సింది పోయి ఉన్న వాటినే రద్దు చేస్తుండడంతో ప్రయాణికులకు మరిన్ని కష్టాలు పెరిగిపోతున్నాయి. ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాలంటే సమీప పట్టాణాలకు పోవాల్సిన పరిస్థితి నెలకొంది.





ఆసిఫాబాద్ రోడ్ రైల్వే స్టేషన్‌లో ఉన్న రైల్వే ట్రాక్

గోలేటికి ఇతర ప్రాంతాల వాసులు

కుమరం భీం జిల్లా గోలేటికి మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియాలో ఎక్కువ శాతం పెద్దపల్లి, వ రంగల్, జనగాం, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జమ్మి కుంట నుంచి వలస వచ్చి సింగరేణిలో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్నారు. వీరే కాకుండా కార్మికేతరులు వారి పిల్లలు ఎక్కువగా కాజీపేట, వరంగల్, కొత్త గూడెం వైపు ప్రయాణిస్తుంటారు. సింగరేణి ఉద్యోగు లు నిత్యం పని నిమిత్తం కొత్తగూడెం సింగరేణి కార్పో రేట్ కార్యాలయం, సింగరేణి ప్రధాన ఆసుపత్రికి రాక పోకలు సాగిస్తుంటారు. సింగరేణి, రామగిరి రైళ్లు అందుబాటులో ఉండేవి. కరోనా సమయంలో ఈ రైళ్ల హాల్టులను ఎత్తి వేశారు.

కొత్తగూడెం నుంచి బల్లార్షాకు వెళ్లే సింగరేణి రైలుకు హాల్టింగ్ ఇవ్వడం లేదు. ఆసిఫాబాద్ రోడ్డు స్టేషన్‌లో భాగ్యనగర్, రామగిరి, ఇంటర్‌సిటి, పుష్పుల్ రైళ్లు మాత్రమే ఆగుతున్నాయి. మిగితా ఎక్స్‌ప్రెస్ రైళ్లు హాల్టింగ్ ఇవ్వడం లేదు. ఎక్స్ ప్రెస్ రైలులో వెళ్లాల్సిన వారు ఇటు కాగజ్‌నగర్ వైపు కానీ, అటు బెల్లంపల్లి వైపు కానీ చేరుకోవల్సిన పరిస్థితి నెలకొంది. ఆసిఫా బాద్ రోడ్ రైల్వే స్టేషన్‌లో సింగరేణి, వార్ధా ప్యాసింజర్, కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలు, జీటి ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపాలని వినతి పత్రాలిచ్చినా ఇంత వరకు అధికారులు దీనిపై చర్యలు తీసుకోవడం లేదు. సింగరేణి బొగ్గు గని ద్వారా రైల్వేశాఖకు నెలకు సుమారు కోటి రూపాయల ఆదాయం వస్తోంది. ఇలా ఆదాయం ఉన్నా స్టేషన్‌లో ప్రయాణికులకు వెయిటింగ్ హాల్, మరుగుదొడ్ల సౌకర్యం లేదు. గంటల తరబడి రైళ్ల కోసం నిలబడే వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

మరిన్ని రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలి..

ఎం నరేందర్, గోలేటి టౌన్‌షిప్



ఆసిఫాబాద్‌రోడ్ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ ఇవ్వాలి. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా చర్యలు తీసుకోవడం లేదు. వీటితో పాటు సింగరేణి, రామగిరి రైళ్లకు హాల్టిం గ్ లేదు. ఈ రైళ్ల ద్వారా మంచిర్యాల జిల్లాలో పని చేసే సింగరేణి కార్మికులు ఇక్కడికి వచ్చే అవకాశం ఉండేది. ఉన్నతాధికారులు స్పందించి రైల్వేస్టేషన్‌లో సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి.

ఇందిరమ్మ ఇళ్లు త్వరలో ప్రారంభిస్తాం

సత్యనారాయణ, ఎంపీడీవో



ఆంధ్రజ్యోతి: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారా?

ఎంపీడీవో: మండలంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన మెడ్‌పల్లి గ్రామంలో 154 ఇందిరమ్మ ఇళ్ల నిర్మా ణాలు త్వరగా ప్రారంభిస్తాం. దీంతో పాటు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నమునా గృహం నిర్మాణం పూర్తియింది.

ఆంధ్రజ్యోతి: వారంతపు సంత స్థలం అక్రమణపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎంపీడీవో: వారాంతపు సంత స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడితే వారికి నోటీసులు ఇస్తున్నాం. అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు తేలితే తొలగిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: వారసంతలో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారా?

ఎంపీడీవో: మండల కేంద్రంలోని అంగడిబజార్‌లో ప్రజల సౌకర్యార్థం రూ.2.10 లక్షల ఎస్‌డీఎం నిధులతో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం పనులు చేపట్టాం. ఉన్నతాధికారులతో వాటిని త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

\- సిర్పూర్(టి), ఆంధ్రజ్యోతి

‘భూభారతి’తో సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రె, పాల్గొన్న ఎమ్మెల్సీ దండే విఠల్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, ఇతర అధికారులు

సిర్పూర్(యు), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): భూభారతి పోర్టల్ ద్వారా జిల్లాలో భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మండలంలోని మహగాంలో రైతు వే దికలో రైతులు,ప్రజలకు భూ భారతిపై నిర్వహించిన అవగాహన స మావేశంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎమ్మెల్సీ దండే విఠల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం భూ భా రతి ద్వారా భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. ఇందులో రైతులకు సంబంధించిన అన్ని రకాల భూ సమస్యలను సులభంగా పరిష్కరించే వీలు ఉందని చెప్పారు. సమస్యలు ఉన్న వారు అధికారులు సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు. దీంతో పాటు రైతులకు అధికారులు అందుబాటులో ఉండే విధంగా వీఆర్వోలు, వీఆర్‌ఏల ను ప్రభుత్వం నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. తహసిల్దార్ స్థాయి నుంచి కలెక్టర్ వరకు భూ సమస్యలు పరిష్కరించే ఆవకాశం ఉందని , సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వరావు, తహసీల్దార్ ఉదయ్‌కుమార్, ఎంపీడీవో కృష్ణారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మే త విశ్వనాథ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లింగాపూర్, (ఆంధ్రజ్యోతి): భూభారతి పోర్టల్ ద్వారా జిల్లాలో భూములకు సంబంధించిన సమస్య లు పరిష్కారమవుతాయని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మండల కేంద్రలోని రైతువేదికలో రైతులకు భూభారతిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎమ్మెల్సీ దండే విఠ ల్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల భూసమస్యలు పరిష్క రించేందుకే ప్రభుత్వం భూభారతి పోర్టల్ అందుబాటులోకి తీసుకొచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో లోకేశ్వర్‌రావు, అదనపు కలెక్టర్ డేవిడ్, తహసీల్దార్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

పోడు రైతులు ఆందోళన చెందొద్దు

ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

చింతలమానేపల్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పోడు రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని గత ఏడాది దున్నుకున్న భూములను వదలవద్దని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు రైతులకు సూచించారు. మండలంలోని బాలాజీ అనుకోడ రైతు వేదికలో మంగళవారం చింతలమా నేపల్లి, బెజ్జూరు మండలాలకు సంబంధించిన 189 మంది లబ్ధిదారులకు కలాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను, ముగ్గురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోడు రైతులు ఎవరు ఆందోళన ఎందాల్సిన అవసరం లేదన్నారు. గత సంవత్సరం సాగు చేసుకున్న పోడు భూములను ఈ సంవత్సరం కూడా సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఈ విషయంపై మంత్రులు సీతక్క, కొండా సురేఖ హామీ ఇచ్చారని తెలిపారు. గూడెం గ్రామంలో కొత్తగా 33 కేవీ సబ్ స్టేషన్ మంజూరు చేయించానని, గూడెం పరిసర ప్రాంతాలు, బెజ్జూరు మండలం లోని కొన్ని గ్రామాలు విద్యుత్ సమస్య నుంచి ఉపశమనం పొందుతాయని తెలిపారు. కౌటాల 133 కేవీ సబ్ స్టేషన్ త్వరలో ప్రారంభమవుతుందని దీని ద్వారా ప్రతి చింతలమానేపల్లి మండలానికి సమస్య శాశ్వతంగా తీరుతుందన్నారు. చింతలమానేపల్లి, బెజ్జూరు మండలాలకు సంబంధించి కొన్ని అభివృద్ధి పనులను పెండింగ్‌లో ఉన్నాయని వాటిని కూడా త్వరలో పూర్తి చేస్తామని, తునికాకు సేకరణకు సంబంధించి అటవీ శాఖాధికారులు అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ తాము ప్రభుత్వ యంత్రాంగంతో మాట్లాడి సమస్యను పరిష్కారం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్‌లు మునావర్ షరీఫ్, భూమేశ్వర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, ఎస్సై నరేష్, డీటీ దౌలత్, బీమ్లానాయక్, నాయకుల రామన్న, విజయ్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని రవీంద్రనగర్-1 గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.35 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే హరీష్‌బాబు ప్రారంభించారు అభివృద్ధి పనులు వేగంగా కొనసాగిస్తామని తెలిపారు.

చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించాలి

వాంకిడి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించడానికే పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి సీడీపీవో రిబ్కా అన్నారు. బంబార రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన పోషణ పక్వాడ ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకోవాలన్నారు. చిరుధాన్యాల ప్రయోజ నాలు, వినియోగం, స్థానికంగా దొరికే ఆహార పదార్థలు వాటిని వినియోగించడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయంచారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కుమారి, భారతి, కో ఆర్డినేటర్ తౌఫిక్, సోషల్ వర్కర్ ప్రవీణ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ యశోద అన్నారు. మండలంలోని దాంపూర్ గ్రామంలోని అంగ న్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిన్న పిల్లలకు అన్నప్రాసన నిర్వహంచారు. చిరుధాన్యాల ప్రయోజనాలు, వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వినోద తదితరులు పాల్గొన్నారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు సమతుల్య ఆహారం తీసుకోవాలని సీడీపీఓ విజయలక్ష్మి అన్నారు. మంగళవా రం మండలంలోని గుంట్లపేట గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమంలో సీమంతాలు, పిల్లల బరువు, పిల్లలకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. చిరుధాన్యాల ప్రయోజ నాలు, వినియోగం, స్థానికంగా దొరికే ఆహార పదార్థలు వాటిని వినియోగించడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రమౌళి, అంగన్‌వాడీ టీచర్లు రాజమణి,పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలో నెలకొన్న కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని ఏరియా జనరల్ మేనేజర్ ఎం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జీఎం కార్యాలయంలో నిర్వ హించిన స్ట్రక్చరల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు మరణించిన సందర్భంగా ఆయనకు సంతాపం తెలిపారు. అనంతరం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా మాట్లాడుతూ, ఎస్‌డీఎల్ యంత్రాలకు కొత్త సీట్లు అమర్చాలని, మ్యాన్‌వేలలో ల్యాండ్ ఫోన్లు మరమ్మతులు చేయించాలని, అండ ర్‌గ్రౌండ్ అలవెన్సుల కోత విధించవద్దని, డంప్‌యార్డును తరలించా లని, వీటీసీలో ఆర్‌ఓ ప్లాంటు ఏర్పాటు చేయాలని చెప్పారు. స్టోర్‌లో అవసరమైన మెటీరియల్ అందుబాటులో ఉంచాలని, ఖాళీగా ఉన్న డాక్టరు పోస్టులను భర్తీ చేయాలని, ఫార్మసిస్టు, ఫిజియోథెరపిస్టుల కు ప్లేడేలు ఇవ్వాలని, సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ఖాళీలను సీనియార్టీ ప్రకారం భర్తీ చేయా లని, తదితర సమస్యలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, గుర్తింపు సంఘం తెలిపిన సమస్యలను ఆయా విభాగాల అధికారుల ద్వారా పరిష్క రించేందుకు ప్రయత్నిస్తామని తెలి పారు. కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం ఎన్. సత్యనారాయణ, శ్రీరాంపూర్, ఇందా రం ఓసీపీల పీవోలు టి. శ్రీనివాస్, ఏవీ రెడ్డి, డీజీఎంలు అరవిందరావు, రవీందర్, మల్ల య్య తదితరులు పాల్గొన్నారు.

నూతన గనులను ఏర్పాటు చేయాలి



కేకే 5 గనిపై వినతిపత్రం ఇస్తున్న మేడిపల్లి సంపత్

మందమర్రిటౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తెలం గాణలో ఉన్న సింగరేణి సంస్థ పరిరక్షణతో పాటు నూ తన గనులను ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళ వారం టీబీజీకేఎస్ నాయకులు అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. కేకే 5 గనిపై ఏరియా ఉపాధ్య క్షుడు మేడిపల్లి సంపత్, వర్కుషాపులోనాయకుడు ఓ. రాజశేఖర్‌లు మాట్లాడుతూ సింగరేణిలో నూతన గను లు రాకపోతే కార్మికుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారు తుందన్నారు. చాలా మంది కార్మికులు అనారోగ్యంతో బాధపడుతున్నారని, మెడికల్ రెఫరల్ విధానాన్ని సులభతరం చేయాలని కోరారు. కార్మిక కు టుంబాల కు సురక్షిత మంచినీటిని అందించాలన్నారు. గెలిచిన సంఘాలు కార్మికులకు చేసిందేమి లేదన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం టీబీజీకేఎస్ కృషి చేస్తుందన్నా రు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరారెడ్డి, సారయ్య, మధుసూదన్‌రెడ్డి, మల్లేష్, శ్రీనివాస్, రాజేష్ నాయక్, వేణునాయక్, సాయి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో నూతన బొగ్గు గనులు ఏర్పాటు చేయాలని టీబీజీకేఎస్ నాయ కులు నినదించారు. మంగళవారం శ్రీరాంపూర్ ఏరియా లోని అన్ని గనులు, ఓసీపీలపై మేనేజర్లకు వినతిపత్రా లు అందించారు. 3,3ఏ గనిపై టీబీజీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఉత్తేజ్ రెడ్డి, సోషల్ మీడియా ఇన్‌చార్జి పవన్ కళ్యాణ్, ఎస్‌ఆర్‌పీ-1 గనిపై ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, శ్రీరాంపూర్ ఓసీపీపై ఉప ప్రధాన కార్యదర్శి బండి రమేష్, గడ్డం మహిపాల్ రెడ్డి, ఇందారం ఓసీపీ, 1ఏ గనులపై సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్వేష్ రెడ్డి, ఆర్‌కే-7 గనిపై రాజునాయక్, ఆర్‌కే న్యూటెక్ గనిపై ఉప్పాల సంపత్, లాల, ఆర్‌కే-5. 6 గనులపై పాగాకు రమేష్, ఏరియా స్టోర్స్, ఏరియా వర్క్‌షాప్‌పై ఇతరలు వినతిపత్రాలు అందించారు.

జైపూర్, (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కొత్త బొగ్గు గనులను ఏర్పాటు చేయాలని టీబీజీకే ఎస్ నాయకులు ఐకే1ఏ గని మేనేజర్ వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ జాయింట్ సెక్రటరీ పానుగం టి సత్తయ్య మాట్లాడు తూ రామగుండం, కొత్తగూడెం, బెల్లంపల్లి రీజియన్‌లలో కార్మిక కుటుంబా లకు మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమం లో అన్వేష్ రెడ్డి, దేవేందర్‌రెడ్డి, రమణ, తిరుపతి, సతీష్, నరేష్, దినేష్‌రెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): ఖైరిగూడ మేనేజర్‌కు మంగ ళవారం నాయకులు వినతి పత్రం అందజేశారు. పెం డింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఫిట్ కార్యదర్శి మా రిన వెంకటేశ్వర్లు, నాయకులు చంద్రశేఖర్, నాయకులు తిరుపతి స్వామి, మొగిలయ్య రెడ్డి, సంజీవ్, రాజమౌళి, సుధాకర్ శ్రీనివాస్ బాబు పాల్గొన్నారు.



మెరిట్ స్కాలర్‌షిప్ రూ.16 వేలకు పెంపు

ఉత్తర్వులు జారీ చేసిన సింగరేణి యాజమాన్యం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఎంసెట్, నీట్, జేఈఈ, ఎయిమ్స్ తదితర పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన సింగరేణి కార్మికుల పిల్లలకు ఇచ్చే మెరిట్ స్కాలర్‌షిప్‌ను 10 వేల రూపాయల నుంచి 16 వేల రూపాయల వరకు పెంచుతూ సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. కనీస ర్యాంక్ 2 వేల నుంచి 8 వేల వరకు పరిగణలోకి తీసుకుంటామని అందులో పేర్కొన్నారు. కార్మికుల పిల్లలకు ఉన్నత చదువుల పట్ల ఆసక్తి పెంచేందుకు, వారిని ప్రోత్సహించేందుకు 1998లో సింగరేణి యాజమాన్యం మెరిట్ స్కాలర్‌షిప్ పథకాన్ని ప్రవేశపెట్టింది. గతంలో 2వేల ర్యాంకులోపు ఉన్న వారికి మాత్రమే వర్తింపజేస్తూ ఏడాదికి రూ. 6 వేల చొప్పున చదువు పూర్తయ్యే వరకు అందించేవారు. స్కాలర్‌షిప్ పెంచాలని ఉద్యోగుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు 2010లో విద్యార్థులకు అందించే మొత్తాన్ని రూ.10 వేలకు పెంచారు. ఇటీవల గుర్తింపు సంఘం ఏఐటీయూసీతో జరిగిన నిర్మాణాత్మక సమావేశంలో మెరిట్ స్కాలర్‌షిప్‌ను రూ.10 వేల నుంచి రూ. 16 వేలకు పెంచాలని యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. దీనికి సంస్థ సీఎండీ ఎన్. బలరాం సానుకూలంగా స్పందించారు. ఆయన ఆదేశం మేరకు సవరించిన స్కాలర్‌షిప్‌నకు సంబంధించిన సర్క్యులర్‌ను డైరెక్టర్(పా) విడుదల చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశ పరీక్షలకు హాజరైన విద్యార్థులకు వర్తిస్తుందని, అన్ని ఏరియాల నుంచి జూన్ 15వతేదీలోగా దరఖాస్తులు పంపించాలని ఆయన వెల్లడించారు. ఎంసెట్‌లో 8 వేల ర్యాంకు వరకు సాధించిన వాకి కోర్సు పూర్తయ్యేంత వరకు ఏడాకి రూ.16వేలు చొప్పున మెరిట్ స్కాలర్‌షిప్‌ను అందిస్తామని, అలాగే జేఈఈ మెయిన్స్(ఎన్‌ఐటీ), ఎయిమ్స్, బిట్ శాట్(బిట్స్ పిలాని)లో ప్రవేశం పొందే వారికి ఉత్తమ ర్యాం కు ఆధారంగా స్కాలర్‌షిప్‌ను వర్తింపజేయనున్నామని ఆయన తెలిపారు.

సుర్రుమంటున్న సూరీడు..

(5వ పేజీ తరువాయి)

ప్రాంతాలతో పోల్చితే బొగ్గు గనులు ఉన్న ఏరియాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ముఖ్యంగా ఓపెన్‌కాస్టు గని కార్మికులు ఎండ వేడికి కుదేలవుతున్నారు. దీంతో పని వేళల్లో మార్పులు చేయాలనే డిమాండ్లు తెరపైకి వస్తున్నాయి. గతంలో వేసవి ఎండలకు సింగరేణిలో పనివేళల్లో మార్పులు చేసేవారు. పదేళ్లుగా ఆ పద్ధతికి స్వస్తి పలకడంతో కార్మికులకు ఇబ్బందులు తప్పడం లేదు. సాధారణ రోజుల్లో ఫస్ట్ షిఫ్ట్ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సెకండ్ షిఫ్ట్ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు ఉంటుంది. అయితే ఎండలు పెరిగినప్పుడు పై రెండు షిఫ్టుల్లో పని వేళలను యాజమాన్యం గంట ముందుకు మార్చేది. అలా ఫస్ట్ షిఫ్ట్ ఉదయం 5 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, రెండో షిఫ్టును సాయంత్రం 4 నుంచి రాత్రి 12 గంటల వరకు మార్పులు చేసేవారు. దీంతో ఎండవేడి నుంచి కార్మికులు ఉపశమనం పొందేవారు. గతంలోలాగే పని వేళల్లో మార్పులు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

పది రోజుల్లో నమోదైన ఉష్ణోగ్రతలు..

జిల్లాలో గడిచిన పది రోజుల్లో నమోదైన ఉష్ణోగ తల వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 12న జిల్లాలో 43.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే ఈ నెల 13న 43.6 డిగ్రీలు, 14న 43.1 డిగ్రీలు, 16న 41.4 డిగ్రీలు, 17న 40.7 డిగ్రీలు, 18న 41.7 డిగ్రీలు, 19న 41.7 డిగ్రీలు, 21న 42.8 డిగ్రీలు, 22న 43.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉష్ణోగ్రతల్లో గణనీయమైన మార్పులు వస్తుండటంతో జిల్లాలో వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తోంది. రాబోయే మే నెలలో పరిస్థితులు ఎలా ఉంటాయోనన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది.

ఎల్లంపల్లి ప్రాజెక్టులో తగ్గుతున్న నీటి మట్టం..

జిల్లాలోని గుడిపేట సమీపంలోగల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి మట్టం ఘననీయంగా తగ్గు ముఖం పట్టింది. మంగళవారం 8.746 టీఎంసీలకు పడిపోయింది. ప్రాజెక్టు లెవల్ 148.00 అడుగుకుల కుగాను ప్రస్తుతం 142.87 అడుగుల నీరుంది. అలాగే 20.175 టీఎంసీల సామర్థ్యానికిగాను 8.746 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. ప్రాజెక్టు నుంచి హైద్రాబాద్ మెట్రో వర్క్ స్టేషన్‌కు 330 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఎన్టీపీసీ పంప్ హౌజ్‌కు 121 క్యూసెక్కులను నిత్యం విడుదల చేస్తున్నారు.

నిరుపేదలకు భూమి పట్టాలు అందజేయాలి

జన్నారం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతగూడెం గ్రామ శివారులోని పాపమ్మగూడలోని సర్వే నెంబరు 81/1 లోని 20 ఎకరాల భూమిని పేదలకు పంచి పట్టాలు అందించాలని మంగళవారం సీపీఐఎంఎల్‌మాస్‌లైన్ పార్టీ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి దేవరాజు, మండల అధ్యక్షుడు పురంశెట్టి బాపు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ చింతగూడ పరిధిలోని పేదలకు ఇండ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సర్వే నెంబరులోని 20 ఎకరాల భూమిలో అటవీ, రెవెన్యూ శాఖలు జాయింట్ సర్వే చేసి భూమిని పేదలకు పంచాలన్నారు. నాయకులు రజిత, శోభ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చెన్నూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుద్దాల గ్రామంలో మంగళవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కరుణసాగర్‌రావులు ప్రారంభించారు. రైతులు దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలన్నారు కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హేమంత్‌రెడ్డి, వెంకటి, మల్లేష్, సిబ్బంది లక్ష్మణ్‌రెడ్డి పాల్గొన్నారు.



పుస్తకం విజ్ఞాన భాండాగారం

పుస్తక పఠనంతో మేధాసంపత్తి..

నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం


నస్పూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనం వలన విజ్ఞానం పెంపొందడంతో పాటుగా మనిషి ప్రశాంత జీవనానికి దోహదపడుతుంది. మహనీయుల, దేశ, రాష్ట్ర చరిత్రలు, పురాణాలు, రామాయణం, మహాభారతం, బాగోత గాథలు, కథలు, ఇతిహాసాలు, బాల మిత్ర కథలు, నవలలు ఎన్నో రకాల పుస్తకాలు మనకు వివిధ గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్నాయి. చరిత్రలో ముఖ్యుల గొప్పతనాలు, పోరాట గాథలు పుస్తక రూపంలో అందుబాటులో ఉన్నాయి. ఈ నెల 23న ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా...

● **పుస్తక దినోత్సవ నేపథ్యం..**

ఏప్రిల్ 23న విలియం షేక్స్పియర్ పుట్టిన, మరణిం చిన రోజు. మిగ్యుల్ డి సెర్వంటెస్, గార్సిలాసో డి వేగా వంటి ప్రముఖ రచయితలు ఇదే రోజు మరణించారు. వారితో పాటు ప్రపంచ ప్రఖ్యాత రచయితలకు నివాళులర్పించేందుకు 1995లో పారిస్‌లో జరిగిన యునెస్కో జనరల్ కాన్ఫరెన్స్‌లో ఏప్రిల్ 23ను ప్రపంచ పుస్తక దినో త్సవంగా ప్రకటించారు. ఇది యునెస్కో ద్వారా ప్రతీ సంవత్సరం నిర్వహించే ప్రపంచ వ్యాప్త కార్యక్రమం.

● **పుస్తకం కానుకగా...**

పాఠశాల స్థాయి నుంచే పుస్తకాలను చదివే అల వాటును అలవర్చుకోవాలి. దీనికి పునాది పాఠశాలే కావాలి. దేవాలయం భక్తుడికి ఎంత ముఖ్యమో... పుస్తకాలయం విద్యార్థికి అంతే ముఖ్యం. నేటి పుస్త కాల్లోకూడా అనేక మార్పులు రావాలి. విద్యార్థికి విద్య ఎంత ముఖ్యమో నైతిక విలువలు కూడా అంతే ముఖ్యం. పూర్వం పెద్ద బాల శిక్షల్లో అన్ని విషయాలుండేవి. నేడు పుస్తకాలు ఉన్నా అనుకున్న స్థాయి విద్యార్థుల్లో నైతిక విలువలు పెరగడంలేదు. కాబట్టి మహనీయులు జయంతుల, వర్థంతి వేడుకల్లో మంచి పుస్తకాలను పంపిణీ చేయాల్సిన అవసరం ఉన్నది.



ఇంటర్‌లో మిమ్స్ ప్రభంజనం



గిట్టే సుధాకర్



ఇందూరి శృతి



కంబాల జశ్వంత్



విశ్వనాథ్ అశ్మిత

మంచిర్యాలక్రైం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో మిమ్స్ కళాశాల ప్రభంజనం సృష్టించింది. నిన్నటి జేఈఈ మెయిన్స్‌తో పాటు నేడు వెలువడిన ఇంటర్ ఫలితాల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. అద్భు త ఫలితాలు సాధించిన విద్యార్థులకు కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ రాజు డైరెక్టర్ ఉపేందర్‌రెడ్డి శ్రీధర్‌బాబు, విజయ్‌కుమార్, ప్రిన్సిపల్ శైలజారావు విద్యార్థులను అభినందించారు. ఎంపీసీ మొదటి సంవత్సరం అశ్రిత 467/470, వి. శ్రీనిధి 467/470, బి. మైత్రి 466/470, మనోజ్ 466/470, జి. అరుణ శ్రీ 466/470, డి. రాహుల్ 465/470, ఎం. సంజయ్ 465/470 సాధించారు. బైపీసీ మొదటి సంవత్సరం అఫ్రీన్ 436/440, ఎం. హిమహర్షిణి 434/440 సాధించారు. సీఈసీ మొదటి సంవత్సరం ముమీన 489/500, జి. వైష్ణవి 486/500, డి. అభిషేక్ 486/500, ఎంపీసీ ద్వితీయ సంవత్సరం ఐ. శృతి 992/1000, ఎస్. అశ్రిత 990/1000, కె.జశ్వంత్ 988/ 1000, వి. అశ్విత 988/1000, కె. సుమన్విత 985/1000, బి. సాయితేజ 982/1000, టి. భవాని 980/1000 సాధించారు. బైపీసీ ద్వితీయ సంవత్సరం జి.సుధాకర్ 984/1000, కె. వెన్నల 982/1000, ఎండీ సాహేదా సిద్దిక 981/1000 సాధించారు. సీఈసీ రెండో సంవత్సరం ఏ. సాక్షి 969/1000, ఆర్. స్పందన 965/1000 మార్కులతో మిమ్స్‌ను మెరిపించారు. మంచిర్యాల ప్రతిభ కనబరిచిన యాజమాన్యం అభినందించారు.

ఎస్‌ఆర్‌ఆర్ విజయకేతనం



సిహెచ్. వాగ్దేవి



డి. రంజిత్



ఎం.మనోగ్న

మంచిర్యాల క్రైం, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో మంచిర్యాల కేంద్రంలోని ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల ఫలితాల్లో విజయ కేతనం ఎగురవేసింది. రాష్ట్ర స్థాయి మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ చైర్మన్లు, డైరెక్టర్లు మల్లయ్య, మానయ్య శ్రీనివాస్, సిబ్బంది ప్రత్యేక అభినందనలు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో సిహెచ్ వాగ్దేవి 988/1000, ఎ. సాయిదివ్య 987/1000, జి. అశ్వల 982/1000, బైపీసీ విభాగంలో ఎం. మనోగ్న 982/1000, .పి. సాకేత్‌రాం 974/1000, సిహెచ్ హన్షిక 973/1000, సీఈసీ విభాగంలో డి.రంజిత్ 979/1000, సిహెచ్ సాయి మాధవి 933/1000, డి. శివాని 930/1000 మార్కులు సాధించగా ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో ఎం. శివనందిని 463/470, కె. వైష్ణవి 461/470, ఎం. ఆవిష్కార్ 460/470, బైపీసీ విభాగంలో కె. ఆశ్రయ 429/440, టి. దివ్య 426/440, ఎం. అమూ ల్య 419/440, జెస్సికా ఫ్లోరా 418/ 440, సీఈసీ విభాగంలో 490/500, కె. అక్షయ 486/500, ఆర్. శృతి 471/500, ఈ సందర్భంగా విద్యార్థులు ప్రతిభ కనబరిచిన వారందరిని కళాశాల యాజమాన్యం అభినందించారు.

శాంతిభద్రతల పరిరక్షణకే కార్డన్‌సర్చ్

కాసిపేట, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలను పరిరక్షించేందుకే గ్రామాల్లో కార్డన్ సర్చ్ నిర్వహిస్తున్నామని మందమర్రి సీఐ శశిదర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కోమటిచేనులో కార్డన్ సర్చ్ నిర్వహించి ప్రజలకు నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైన అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగు తుంటే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి, ఎవరుకూడ అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వరాదని సూచించారు. అనంతరం నంబర్ ప్లేట్‌లేని 26 ద్విచక్రవాహనాలు, నాలుగు ఆటోలను గుర్తించి వాటిని అక్కడిక క్కడే జరిమాన విధించారు. రెండు నంబర్‌ప్లేట్, పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. సైబర్ క్రైం, గంజాయి నియంత్రణ, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, ట్రాఫిక్ రూల్స్ కొత్తచట్టాల పై అవగాహన, మూఢ నమ్మకాల గురించిస్థానిక ప్రజలకు వివరించారు. కార్డన్ సర్చ్ ఆపరేషన్‌లో భాగంగా గ్రామంలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న దుర్గం సూర్య ప్రకాశ్, రాంటెంకి అర్జున్‌లపై ఎక్సయిజ్ కేసు నమోదు చేశామన్నారు. కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్, దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు, మందమర్రి, రామకృష్ణాపూర్ ఎస్ఐలు పాల్గొన్నారు.



కోమటిచేనులో మాట్లాడుతున్న మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి

సంక్షిప్త సమాచారం

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సెంటర్లలో నిర్వహించిన పోషకపక్షం కార్యక్రమాలు మంగళవారంతో ముగిసాయి. సూపర్ వైజర్ మమతతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్ : ఇటీవల ఆత్మహత్య చేసుకున్న వేమనపల్లి మండలంలోని మంగెనపల్లి గ్రామానికి చెందిన నాయిని కన్నయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు.

నస్పూర్ : వేమనపల్లి మండలం మంగేనపల్లి గ్రామానికి చెందిన నాయని కన్నయ్య మృతికి కారణకులైన వారిని చర్యలు చేట్టాలని సీపీఎం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నస్పూర్‌లోని సీసీసీ కార్నర్ వద్ద అంబేద్కర్ విగ్రహం ఎదుట నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

కోటపల్లి : కోటపల్లి నిరసన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బోడెంకి చందు పాల్గొన్నారు. డిమాండ్ చేశారు. మంగళవారం

వేమనపల్లి : వేమనపల్లిలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న నిరసన తెలిపారు. వెంకటి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భీమారం : భీమారంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. సమ్మక్క, స్వరూప, ఉమారాణి, సరిత పాల్గొన్నారు.

కాసిపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్‌వోఆర్ చట్టంపై రైతులకు, ప్రజాప్రతినిధులకు అవగామన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ భోజన్న ఒక ప్రకటనలో తెలిపారు.

దండేపల్లి : ద్వారక గ్రామానికి చెందిన అంబడిపల్లి నరసవ్వ కూతురు స్వరూప ఇటీవల గోడకూలీ ఆమెపై పడి కాలు విరిగింది. నిరుపేద కుటుంబం కావడంతో మండల ఆర్యవైశ సంఘం, కస్తూరీ వెంకటేష్ ద్వారక మిత్ర బృందం, లక్సెట్టిపేట శివసాయి సేవా సమితి ఆధ్వర్యంలో వాట్సాప్ గ్రూపు ద్వారా స్పందించిన దాతల సహకారంతో పోగు చేసిన రూ. 55,555 నగదు, 25కేజీల బియ్యం అందజేశారు.

జైపూర్ : పిల్లల ఎదుగుదలకు తల్లులు పౌష్టికాహారం అందించాలని ఐకేపీ ఏపీఎం రాజ్‌కుమార్ పేర్కొ న్నారు. పోషణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అన్నప్రాసన చేయించారు.

ఇంటర్ ఫలితాల్లో బాలికలదే హవా

జిల్లాకు 21వ స్థానం

మంచిర్యాలక్రైం, ఏప్రిల్22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో మంచిర్యాల 21వ స్థానంలో నిలిచింది. ఈ సంవత్సరం ఫలితాల్లో బాలికలే పై చేయిగా నిలిచింది. రెండవ సంవత్సరం వొకేషన్‌లో 905 పరీక్షలు రాయగా 698 మంది ఉత్తీర్ణులుకాగా స్టేట్‌లో 7వ స్థానంలో నిలిచింది. జనరల్‌లో మొత్తం విద్యార్థులు 4968 మంది పరీక్షలు రాయగా 3371 ఉత్తీర్ణులయ్యారు. 67.85శాతంతో 21వ ర్యాంక్‌లో నిలిచింది. ఇందులో బాలురు 58.31శాతం కాగా బాలికలు 75.63తో ముందంజలో ఉన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో వొకేషన్‌లో 929 మంది పరీక్షలు రాయగా 573 మంది పాసయ్యారు. 61.68శాతంతో 14 వ ర్యాంక్ ఉండగా మొదటి సంవత్సరం జనరల్‌లో 4960 మంది పరీక్షలు రాయగా 2705 మంది ఉత్తీర్ణతతో 54.48శాతంతో 26వ ర్యాంక్‌లో నిలిచింది. ప్రథమ సంవత్సరంలో కూడ బాలికలదే పైచేయిగా నిలిచినట్లు ఇంటర్ విద్యాధికారి అంజయ్య తెలిపారు.

●మంచిర్యాల మోడల్ స్కూల్‌జూనియర్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. ఎంపీసీ విభాగంలో పి. రిశ్విత 465/470, సీఈసీ విభాగంలో మాచర్ల సుశ్మిత 488/500, బైపీసీ విభాగంలో దెబ్బట హన్షిక 418/440 మార్కులు సాధించి తమ ప్రతిభను కనబరిచారు. మోడల్ స్కూల్‌లో చదివి ర్యాంక్‌లు సాధించడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ బుచ్చన్న, సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

కోటపల్లి : ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మండల కేంద్రంలోని పీఎంశ్రీ మోడల్ స్కూల్, కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రిన్సిపల్ రాజశేఖర్ మంగళవారం తెలి పారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో పడాల పూజిత 943 మార్కులతో టాపర్‌గా నిలువగా బైపీసీ ద్వితీయ సంవత్సరంలో పాలిక సౌమ్య 984 మార్కులతో టాపర్‌గా, సీఈసీలో వి.రజిత 853 మార్కులతో టాపర్‌గా నిలిచింది. అలాగే రెండవ స్థానంలో ఆశిష్ 928 మార్కులు, బైపీసీలో టి. హర్షిత 905, సీఈసీలో సౌమ్యశ్రీ 712 మార్కులు సాధించి రెండవ స్థానంలో నిలిచారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంసీపీలో ఎండీ స్నీజా 380 మార్కులు, బైపీసీలో నందిని 385, సీఈసీలో విష్ణు 464 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. మొత్తంగా 73 శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. టాపర్‌గా నిలిచిన సౌమ్యను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభిందించారు.



దండేపల్లి: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో లింగాపూర్ ప్రభుత్వ ఆదర్శ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 73 మందికి 61 మంది విద్యార్థులు పాసయ్యారు. ద్వితీయ సంవత్సంలో 103 మందికి 82 మంది విద్యార్థులు పాసయ్యారు.. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో సౌజన్య (417), సంధ్యారాణి(408), బైపీసీలో సాహితి (415), సీఈసీలో అపూర్వశ్రీ (385), సెకండియర్ ఎంపీపీలో నవ్య (887), బైపీసీలో శరణ్య (943), మానస (886), సీఈసీలో శ్రీజ (751) టాపర్లుగా నిలిచారు. మోడల్ స్కూల్‌లో ఫస్టియర్‌లో 77 శాతం, సెకండియర్‌లో 80శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ ఫస్టియర్‌లో 61మందికి, 33 మంది, సెకండ్‌యర్‌లో 115 మందికి 80 మంది పాసయ్యారు. కళాశాల టాపర్లుగా ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో చెన్నవేణి సాధి (936), బైపీసీలో తిరుమ ల (811) కళాశాల టాపర్లుగా నిలిచారు. కళాశాలలోని ఫస్టియర్‌లో 54శాతం, సెకండియర్‌లో 70శాతం మంది విద్యార్థులు పాసయ్యారు.

జైపూర్ : ఇంటర్ ఫలితాల్లో మండలంలోని గురుకుల, ప్రభుత్వ, కేజీబీవీ కళాశాలల విద్యార్థులు సత్తా చాటారు. కోటపల్లి గురుకుల పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ రమేష్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో మహేందర్ 972 మార్కులు, గంగాధర్‌కు 966 మార్కులు, మొదటి సంవత్సరం ఒకేషనల్ సీటీ-1లో పున్నంచంద్ 472, రాజుకు 468, కేతన్‌కు 466 సాధించినట్లు తెలిపారు. జైపూర్ గురుకుల కళాశాలలో 98 శాతం సాధించినట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో జశ్వన్‌కు 957 మార్కులు, బైపీసీలో తాండ్ర దీక్షిత్‌కు 929, మొదటి సంవత్సరం ఎంపీసీలో శ్రీరామ్‌కు 443, బైపీసీలో అరుణ్ తేజ 415 మార్కులు వచ్చినట్లు తెలిపారు. కేజీ బీవీ 97 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్‌వో ఫణిబాల తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 58 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ సంగీత భార్గవి పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో గంగోత్రికి 950 మార్కులు సాధించినట్లు తెలిపారు.

చెన్నూరు : చెన్నూరు పట్టణంలోని చాణక్య జూనియర్ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థి సన్ని ఒల్లెపు 970 మార్కులు సాధించారు. విద్యార్థిని కరెస్పాండెంట్ సుదర్శన్‌రెడ్డి, కో-ఆ ర్డినేటర్ పూర్ణచందర్, ప్రిన్సిపల్ అనితరెడ్డి, డైరెక్టర్‌లు అభినందించారు.

మందమర్రిరూరల్ : ఇంటర్ ఫలితాల్లో మందమర్రి ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ప్రిన్సిపాల్ సారా తస్నీమ్ తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో 94.2 శాతం ఉత్తీర్నత సాధించామని, ఎంపీసీలో అనూష 987 మార్కులు, బైపీసీలో వైశాలి 986, సీఈసీలో ప్రతిమదేవి 932 మార్కులు సాధించారన్నారు మొదటి సంవత్సరం ఎంపీసీలో వర్షిణి 460, బైపీసీలో హాసీని 414, సీఈసీలో శ్రీనిధి 461 మార్కులు సాధించారని తెలిపారు.

మోడల్ స్కూల్ విద్యార్థినికి మూడో ర్యాంక్..



కొమ్మల స్వతంత్ర్య

కాసిపేట, ఏప్రిల్22 (ఆంధ్రజ్యోతి): మంగళవారం ప్రకటించిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతున్న కొమ్మల స్వతంత్ర్య 470/467 సాధించి రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంక్ సాధించింది. సీఈసీలో సౌమ్య 435 మార్కులు సాధిం చింది. మోడల్ స్కూల్ ఇంటర్మీడియలో రెండో సంవత్సరంలో 89మంది ఉత్తీర్ణత సాధించారు. మోడల్ స్కూల్‌లో కళాశాల ప్రిన్సిపల్ ఖలీల్, పాఠశాల సిబ్బంది విజేతలను అభినందించారు.

జన్నారం : ఇంటర్ ఫలితాల్లో జన్నారంలోని రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఎంపీసీవో మొదటి సంవత్సరం విద్యార్థి మోవారి ఆకాష్ 460 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో8వ ర్యాంకు సాధించాడు. విద్యార్థిని రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్ అభి నందించారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో నేహా తమన్నా 978 మార్కులు, స్పందన 970, సుజన్య 970, మహేష్ 950 మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు. కరెస్పాండెంట్ సంపత్, డీన్ హేమలత, ప్రిన్సిపల్ లక్ష్మణ్, అధ్యాప కులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలి

మందమర్రిరూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇండ్లను లబ్దిదారులు త్వరగా నిర్మించుకోవాలని మండల ప్రత్యేకాధికారి అనిత, ఎంపీడీవో రాజేశ్వర్‌లు సూచించారు. మంగళవారం మండలంలోని పొన్నారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరైన లబ్దిదారులతో మాట్లాడారు. ఇండ్లను నాణ్యతగా నిర్మించుకోవాలని, నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని, ప్రభుత్వం బిల్లులను వెంటనే మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరీష్, లబ్దిదారులు పాల్గొన్నారు.

'విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి'

గర్మిళ్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ముందస్తు అడ్మిషన్‌లు చేస్తూ పుస్తకాలు అమ్ముతున్న విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని జాతీయ విద్యార్థి సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో గల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాక ముందే అడ్మిషన్‌లు చేయడం ప్రారంభించారని, సిబ్బందిని విద్యార్థుల ఇండ్లకు పంపించి అడ్మిషన్‌లు చేయిస్తున్నారన్నారు. అధ్యక్షుడు శివతేజ, హరీష్, గౌస్‌బాబు, రమేష్, హరీష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డా కూలీలకు నీటి వసతి కల్పించాలి

బెల్లంపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రతి రోజు కూలీ పనుల కోసం వందలాది మంది అడ్డా కూలీలు పనికోసం వేచి చూస్తారని వేసవిలో తాగునీరు లేక ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని ఎంసీపీఐయూ పార్టీ జిల్లా సహాయక కార్య దర్శి పసులేటి వెంకటేశ్ అన్నారు. మంగళవారం లేబర్ కార్యాల యంలో జూనియర్ అసిస్టెంట్ సంతోష్‌కు అడ్డా కూలీల కోసం చలి వేంద్రం ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవిలో వివిధ గ్రామాల నుంచి కూలీ పనుల కోసం అంబేద్కర్ చౌరస్తా వద్దకు వస్తున్నారని వారికి తాగునీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉన్నతాధికారులు సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నాయకులు సబ్బని రాజశేఖర్ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకే పాదయాత్ర

దండేపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ పరిరక్షణ కే జైబాపు, జైభీమ్. జై సంవిధాన్ పాదయాత్ర ఊరురా చేపడుతున్నట్లు రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, మాజీ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు అక్కల వెంకటేశ్వర్లులు తెలిపారు. మంగళవారం మండలంలోని నెల్కివెంకటాపూర్, చింతపల్లి, తానిమగుడులో జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ పాద యాత్రను పార్టీ నాయకులు, ప్రజలు చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అక్కల శకుంతల, నాయకులు కమలాకర్, మౌలిక-రవి, సతీష్, మధుకర్, చందు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ సహజం

జిల్లా విద్యాధికారి యాదయ్య

లక్సెట్టిపేట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి అని జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. పట్టణంలోని కేఎస్‌ఆర్ ఫంక్షన్ హాలులో మంగళవారం ఎంఈవో హెలన్ డార్థి పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఎంఈవోను పూల మాలలు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఈవో కాసుల రవీందర్, ఎస్‌వోలు చౌదరి, మూర్తితోపాటు మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, మండలాల ఎంఈవోలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

మందమర్రిటౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రామన్ కాలనీకి చెందిన నస్పూరి వినయ్ అనే కాంట్రాక్టు కార్మికుడు ఇటీవల రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోగా ఆయనతో పాటు కేకే ఓసీపీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు రూ. 2.5 లక్షలను మంగళవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఒకరోజు వేతనాన్ని ఇవ్వాలని నిర్ణయించుకుని నగదును వినయ్ కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. రామిరెడ్డి, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

జర్నలిస్టు కుటుంబానికి అండగా ఉంటాం

నెన్నెల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటుతో మృతి చెందిన పాత్రికేయుడు రేణికుంట్ల వెంకటేశ్వర్ కుటుంబానికి అండగా ఉంటామని టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షులు డేగ సత్యం అన్నారు. యూనియన్ నాయకులతో కలిసి నెన్నెలలో మంగళవారం వెంకటేశ్వర్ కుటుంబాన్ని పరామర్శించారు. యూనియన్ సభ్యుల నుంచి జమ చేసిన రూ.34,500ల నగదును అందజేశారు. సంఘం ప్రధానకార్యదర్శి పింగళి సంపత్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూపిరెడ్డి ప్రకాష్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు తనుకు కృష్ణమూర్తి ఉన్నారు.

ఆర్మీలో చేరేందుకు దరఖాస్తులు చేసుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగులు ఆర్మీలో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలపారు. ఇండియన్ ఆర్మీలో కేటగిరిల వారీగా అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, స్టోర్ కీపర్, ట్రేడ్‌మెన్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు పదవ తరగతి పాసై ఉండాలన్నారు. వివరాల కోసం 040-27740205లో సంప్రదించాలన్నారు.





ఇంటర్‌లో అద్వితీయం

- రెండో సంవత్సరం ఫలితాల్లో రాష్ట్రంలో రెండో స్థానం
- మొదటి సంవత్సరంలో నాలుగో స్థానం
- ఉత్తీర్ణతలో బాలికలదే హవా

ఆసిఫాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ మీడియట్ రెండో సంవత్సరం ఫలితాల్లో కుమ రం భీం ఆసిఫాబాద్ జిల్లా విద్యా ర్థులు రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచారు. ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఫలితాల్లో బాలికలదే పైచేయిగా నిలిచింది. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలి చింది. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో రాష్ట్రంలో నాల్గో స్థానం దక్కింది. జిల్లాలో ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో 1,882 మంది బాలురు, 2,317 మంది బాలికలు మొ త్తం 4,199 మంది విద్యార్థులు పరీక్షలు రాశా రు. ఇందులో 1.32 2 మంది బాలురు, 2,017 మంది బాలికలు మొత్తం 3,339 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 79.52 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచారు. ఒకేషనల్ విభాగంలో 330 మంది బాలురు, 391 మంది బాలికలు మొత్తం 721 మంది పరీక్షలు రాశారు. ఇందులో 242 మంది బాలురు, 367 మంది బాలికలు మొత్తం 609 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 84.47 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచింది. ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో 1,749 మంది బా లురు, 2,246 మంది బాలికలు మొత్తం 3,995 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 1.022 మంది బాలురు, 1,794 మంది బాలికలు మొత్తం 2,816 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 70.49 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో నాల్గో స్థానంలో నిలిచారు. ఒకేషనల్ విభాగంలో 384 మంది బాలురు, 377 మంది బాలికలు మొత్తం 761 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 233 మంది బాలురు, 305 మంది బాలికలు మొత్తం 538 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధిం చారు. 70.70 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో నాల్గో స్థానాన్ని సాధించి సత్త చాటారు. ప్రథమ, ద్వితీయ జనరల్, ఒకేషనల్ విభాగాలలో మొత్తం 2,819 మంది బాలురు, 4.483 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు. కాగా బాలికలే పైచేయిగా నిలిచారు. ఈ సంద్భంగా ఉత్తమంగా మార్కులు సాధించిన విద్యార్థులను అధికారులు, ఉపాధ్యా యులు, నాయకులు అభినందించారు.

సత్తా చాటిన విద్యార్థులు



990 మార్కులు సాధించిన పూజితను సన్మానిస్తున్న మోకుదెబ్బ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనిల్‌గౌడ్, గౌడ కులస్తులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు సత్తా చాటారు. తిర్యాణి కళాశాలలో బైపీసీ చదివిన జి పూజిత 990/1000, ఎంపీసీలో సిర్పూర్(టి) ప్రభుత్వ కళాశాల విద్యార్థి మహేష్ 949/1000 మార్కులు సాధించారు. కాగజ్‌నగర్ ప్రభుత్వ కళాశాలలో సీఈసీలో ప్రేమల 947/1000, ఆసిఫాబాద్ ప్రభుత్వ కళాశాలలో హెచ్ఈసీలో విజయ్‌కుమార్ 821/1000, కౌటాల కళాశాలలో ఒకేషనల్ విభాగంలో రాజేంద్రప్రసాద్ 965/1000 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరంలో సిర్పూర్(టి) ప్రభుత్వ కళాశాలలో ఎంపీసీలో వరప్రసాద్ 454/470 మార్కులు, ఎక్రతాహిద్ 452/470, వాంకిడి ప్రభుత్వ కళాశాలలో బైపీసీలో మంగళ 405/440, దహెగాం ప్రభుత్వ కళాశాలలో సీఈసీలో సంతోష్‌కు 466/500, కాగజ్‌నగర్ ప్రభుత్వ కళాశాలలో హెచ్ఈసీలో నాందేవ్ 403/500, కౌటాల ప్రభుత్వ కళాశాలలో ఒకేషనల్‌లో వైష్ణవి 492/500 మార్కులు సాధించినట్లు డీఐఈవో కళ్యాణి తెలిపారు. పట్టణంలోని ఆదర్శ కళాశాల ద్వితీయ సంవత్సరంలో 157 మంది విద్యార్థులకు గాను 150 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో 147 మందికి గాను 120 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ అబిదా తహరీన్ 971/1000, బైపీసీలో దుర్గం విద్య 968/1000, ఎంఈసీలో శ్రీవిద్య 859/1000, సీఈసీలో సాహిత్య 932/1000, ఫస్టియర్ లో ఎంపీసీలో సహరీన్‌బాను 445/470, బైపీసీలో వైష్ణవి 422/440, సీఈసీలో చందన 478/500, ఎంఈసీలో వైష్ణవి 435/500, మహాత్మజ్యోతి బాపూలే బాలుర గురు కుల కళాశాలలో ఎంపీసీలో భీంరావు 946/1000, బైపీసీలో రాజేష్ 929/1000, మహాత్మజ్యో తిబాపూలే బాలికల కళాశాలలో ఎంపీసీలో తెలగ వైష్ణవి 966/1000, బైపీసీలో బుజాడి అంజలి 970/1000, సాంఘిక సంక్షేమ బాలుర కళాశాలలో ఎంపీసీలో ప్రజ్ఞశీల్ 952/1000, బైపీసీలో రాహుల్ 952/1000 మార్కులు సాధించారు. ప్రభుత్వ కళాశాలల్లో, గురుకులాల్లో విద్యార్థులు సత్తా చాటారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): వాంకిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో 86 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ చంద్రయ్య తెలిపారు. ఫస్టియర్‌లో 147 మందికి గాను 119 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో 156 మందికి 135 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలపారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో ఇరుత ఆనంద్ 406 మార్కులు, బైపీసీలో బామినే మంగళ 405 మార్కులు, సీఈసీలో మడావి హిందు 431, ద్వితీయ సంవత్సరం బైపీసీలో సన్‌ప్రీత్ 965, ఎంపీసీలో సుచిత 945 మార్కులు, సీఈసీలో రాజేశ్వర్ 890 మార్కులు సాధించినట్లు తెలిపారు.

కాగజ్‌నగర్ టౌన్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతగూడ బలగల మైనారిటీ బాలురు-1 ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభను చాటారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో ఆర్ సిద్ధార్థ (948/1000), జె మహేశ్ (855/1000), బైపీసీలో షాదుల్ (856/1000), ప్రశాంత్ (799/1000), అలాగే ఫస్ట్ ఇయర్ ఎం.పీ.సి ఫలితాల్లో టి. రాంచరణ్ (454/470), ఆర్.అనీల్ (437/470), ఎస్. తాజ్ బాబా (435/470), బైపీసీలో పి. దత్తుమూర్తి (399/440), ఎం.డి షోయబ్ అలీ (355/440) మార్కులను సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ కె. రోమి ప్రతిభ, లెక్చరర్లు అభినందనలు తెలిపారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): కెరమెరి ప్రభుత్వ జూనియర్ కళాశాలో 72 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ అస్మిత్ అలీ తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో బైపీసీలో జె పవన్ 923/1000 మార్కులతో మండల టాపర్‌గా నిలిచారు. ద్వితీయ సంవత్సరంలో 36 మందికి 25 మంది ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరంలో 111 మందికి 56 మంది ఉత్తీర్ణులయ్యారు. కేజీబీవీలో 36 మందికి 35 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్ఓ తెలిఎారు. కేజీబీవీలో రుక్మిణి అనే విద్యార్థిని 942 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో దహెగాం మండలాల్లోని గ్రామీణ ప్రాంత విద్యార్థులు సత్తా చాటారు. కేజీబీవీ విద్యాలయంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్ఓ శశికల తెలిపారు. విద్యాలయానికి చెందిన ద్వితీయ సంవత్సరంలో ఐశ్వర్య (947/1000) బైపీసీలో టాపర్‌గా నిలిచింది. ప్రభుత్వ జూనియర్ కళశాలకు చెందిన ప్రథమ సంవత్సరంలో 74 మందికి గాను 54 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 75 మందికి 72 మంది ఉత్తీర్ణులయ్యారు. కళాశాలకు చెందిన పాలె సంజలి(877/1000) బైపీసీలో మార్కు లు సాధించింది. గే ప్రథమ సంవత్సరంలో ఎల్కరి శ్రీకాంత్ సీఈసీలో 446/500 మార్కులు సాధించాడు.

తిర్యాణి, (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో తిర్యాణి మండలానికి చెందిన గున్నాల సత్యగౌడ్-సునీత దంపతుల కుమార్తె గున్నాల పూజిత ప్రభుత్వ కళాశాలలో చదివి 990/1000 మార్కులు సాధించింది. పూజితను కాంగ్రెస్ జిల్లా నాయకులు అనీల్‌గౌడ్, మండల ప్రజలు అభినందించారు. తిర్యాణి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 81 శాతం, మొదటి సంవ్సరలో 71 శాతం ఉత్తీర్ణత సాధంచినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 91 మందికి గాను 65 మంది, ద్వతీయ సంవత్సరంలో 121 మందిక గాను 98 మంది ఉత్తీర్ణత సాధించిన్లు తెలిపారు. బైపీసీలో అభినయ 936 మార్కులు, సీఈసీలో శ్రావణి 780 మార్కులు సాధించినట్లు తెలిపారు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో నల్లూరి పూజజ 431 మార్కులు, బైపీసీలో పి.శ్రీరామ్ 40 మార్కులు, సీఈసీలో రజిత 390 మార్కులు సాధించారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచంలొద్ది కేజీబీవీలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఐదుగురు విద్యార్థినులు జిల్లా టాపర్లుగా నిలిచారని ప్రత్యేక అధికారి సుమలత తెలిపారు. ఎంపీహెచ్‌డబ్ల్యు కోర్సులోశిల్పా 956, ఎం. లక్ష్మీ 941, శృతి 937, కల్యాణి 926, ఈశ్వరీ 920 మార్కులు సాధించారని చెప్పారు. మొదటి పంవత్సరం ఫలితా ల్లో అంజలి 500కు 486 మార్కుల సాధించింది.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల కేజీబీవీ విద్యార్థినులు ఇంటర్ రెండవ సంవత్స రం ఫలితలలో వంద శాతం ఉత్తీర్ణిత సాధించిన్నట్లు కేజీబీవీ ప్రత్యేక అధికారిణి స్వప్న తెలిపారు. ఆదర్శ పాఠశాల నుంచి 120 మంది విద్యార్థులు పరీక్ష రా యగా 119 మంది ఉత్తీర్ణత సాధించారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో బెజ్జూరు కేజీబీవీ విద్యార్థులు సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరంలో 50 మందికి గాను 50 మంది ఉత్తీర్ణులయ్యారు. పథ్రమ సంవత్సరంలో 44కు గాను 41 మంది ఉత్తీర్ణులు సాధించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 116 మందికి గాను 96 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 125 మందికి గాను 112 మంది ఉత్తీర్ణత సాధించారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీ కళాశాలలో మొదటి సంవత్సరంలో 91 శాతం, ద్వితీయ సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్‌వో శ్రీజ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో సిర్పూర్(టి) మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన సీహెచ్ మనీషా బైపీసీలో 968/1000 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో రెబ్బెన సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యార్థిని ఎంపీసీ ద్వితీయా సంవత్సరంలో ఎస్.హారికకు 987/1000 సాధించిన టాపర్‌గా నిలిచారు. అలాగే రెబ్బెన కేజీ బీపీ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు స్పెషల్ అధికారి పద్మ తెలిపారు. మొదటి సంవత్స రంలో 54 మంది పరీక్షలు రాయగా, ద్వితీయా సంవ త్సరంలో 69 విద్యార్థులు పరీక్షలు రాసినట్టు అంతా కూడా ఉత్తీర్ణత సాధించినట్లు ఆమె తెలిపారు.


తెలగ వైష్ణవి 966/1000


అంజలి 970/1000


తహరీన్ 971/1000


డి విద్య 968/1000


సుచిత 945/1000


సన్‌ప్రీత్ 965/1000


ఐశ్వర్య 947/1000


మనీషా 968/1000


సరిపుత్ 951/1000


ఎస్ హారిక 987/1000


సిద్ధార్థ 948/1000

'వివేకానంద' విద్యార్థుల ప్రతిభ


జి శ్రీతేజ 467/470


శాంతి 465/470


వర్షిత 465/470


మోయినా ఖానం 436/440


అయిషా 433/440


జియాఖత్రీ 474/500


రుషికా బల్దేవా 969/1000


అక్షయ వర్ధిని 986/1000


తబుస్సాం 983/1000

కాగజ్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన ఇంటర్మీడియేట్ ఫలితాల్లో కాగజ్‌నగర్ వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్టు ప్రిన్సిపాల్ హనుక్ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్స రంలో ఎంపీసీ విభాగంలో జి.శ్రీ తేజ 467/470, సిమ్రాన్ శాంతికి 465/470, కె.అంజన వర్షిత 465/470 టాపర్లుగా నిలిచి నట్టు తెలిపారు. అలాగే బీపీసీ మొదటి సంవ త్సరంలో మోయినా ఖానంకు 436/440 మా ర్కులు, షేక్ అయిషాకు 433/440, సీఈసీలో జియాఖత్రీ 474/500 సాధించినట్టు వివరిం చారు. అలాగే ఎంఈసీ విభాగం ద్వితీయ సంవత్సరంలో రుషికా బల్దేవా 969/1000, బి.అక్షయా వర్ధిని ఎంపీసీ ద్వితీయ సంవత్స రంలో 986/1000, బీపీసీలో లీజా తబుస్సాం కు 983/100 మార్కులు సాధించిన జిల్లా, రాష్ట్ర స్థాయిలో టాపర్లుగా నిలిచారని తెలి పారు. విద్యార్థులను అధ్యాపకులతో పాటు నాయకులు తదితరులు అభినందించారు.

భూగర్భ జలాలు పెరిగేలా చూడాలి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూగర్భ జలాలు పెరిగేలా చూడాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లాతో కలిసి మున్సిపల్ కమిషనర్లు, భూగర్భ జలాల శాఖ, మిషన్ భగీరథ ఇంజనీర్లు, ప్రజారోగ్య శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్, నీటిపారుదల శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, పంచాయతీ శాఖ అధికారులతో కూడిన పర్యవేక్షణ కమిటీ సమావేశంలో నీటి వినియోగం, నీటి పొదుపు, భూగర్భ నీటి మట్టం తరిగి పోకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీ క్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భూగర్భ నీటి మట్టాన్ని పెంపొందించేందుకు పర్యవేక్షణక కమిటీ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సాగునీరు, తాగునీరు పొదుపుగా వినియోగించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, జిల్లాలో వాల్టా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, వాల్టా చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. చేతి పంపులు, బావులు ,సాగునీటి చెరువులు, ప్రాజెక్టులు, వ్యవసాయ పంపు సెట్లు పూర్తి వివరాలతో నివేదిక రూపొందించి అందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, డీపీఓ భిక్షపతి, నీటి పారుదల శాఖాధికారి ప్రభాకర్, గుణవంత్‌రావు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను ప్రజలు విడనాడాలి

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మూఢన మ్మకాలను ప్రజలు విడనాడాలని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. ఆసిఫాబాద్ మండలం సమతులగుండం, భీమన్‌గొంది గ్రామాలను సీఐ రవీందర్‌తో కలిసి మంగళవారం ద్విచక్ర వాహనంపై వెళ్లి సందర్శించారు. సమతులుగుండం గ్రామంలో ఇటీవల ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందగా మూఢనమ్మకాల భయంతో గ్రామాన్ని వదిలి భీమన్‌గొంది గ్రామానికి వెళ్లి నివసిస్తున్న ఆదివాసీ కుటుంబాలను ఏఎస్పీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. జిల్లా పోలీసులు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. పోలీసులు ప్రజా సేవ చేయడంలో ముందుం టారని తెలిపారు. ప్రస్తుతం ఆ గ్రామంలో ఒకే కుటుంబం నివసిస్తుండ డంతో వారికి అవసరమైన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గ్రామస్థులు తమకు రేషన్ కార్డు లేదని, పెన్షన్ రావడం లేదని ఏఎస్పీ దృష్టికి తీసుకు వచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరి స్తానని హామీ ఇచ్చారు. సమస్యలు ఉంటే పోలీసులను సంప్రదిస్తే విచారణ జరిపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని ఏఎస్పీ చిత్తరంజన్ తెలిపారు.

నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేయాలి

రెబ్బెన, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నాణ్యతతో కూడిన బొగ్గును ఉత్పత్తి చే యాలని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. మంగళ వారం కైరిగూడ ఉపరితల గనిలో బొగ్గు నాణ్యతపై ఏర్పాటు చేసిన అవగా హణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అందరు రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి ఎం.నరేందర్, ప్రాజెక్టు ఇంజనీర్ వీరన్న, మేనేజర్ శంకర్, సేఫ్టి ఆఫీసర్ ఎ.నారాయణ, రవి, నరేష్,రజినికుమార్, ఎఐటీయూసీ పిట్ సెక్రటరి ఎం.శ్రీనివాస్, నాయకులు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం రూ.25లక్షలు ఇప్పించాలి

రెబ్బెన, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గోలేటి గ్రామ శివారులో సింగరేణి ఓపెన్ కాస్టులో భూమిని కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం ఎకరానికి రూ.25లక్షలు ఇప్పించాలని బీజేపీ నాయకులు జీఎం భాస్కర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి ప్రతినిధి కేసరి అంజనే యులు గౌడ్ మాట్లాడుతూ గోలేటి, సోనాపూర్ శివారులో సింగరేణి ఓపెన్ కాస్టు ముంపునకు గురవుతున్న భూములకు సింగరేణి యాజమాన్యం ఎకరానికి రూ.25 లక్షలు పరిహారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ సొల్లులక్ష్మి, అరిగెల మధుకర్‌గౌడ్ పాల్గొన్నారు.

సివిల్స్‌లో 68వ ర్యాంకు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నవోదయ పూర్వ విద్యార్థి సాయిచైతన్య మంగళవారం విడుదల చేసిన సివిల్స్ ఫలితాల్లో 68వ ర్యాంకు సాధించాడు. ఉట్నూరుకు చెందిన సాయిచైతన్య 2013లో నవోదయ విద్యాలయంలో చదివాడు. 2019లో బీటెక్ పూర్తి చేశారు. ఆరేళ్లుగా సివిల్స్ కోసం ప్రిపేర్ అవుతున్నాడు. ఈ సందర్భంగా సాయిచైతన్య పలువురు అభినందించారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలం బోదంపల్లి గ్రామానికి చెందిన రాంటేంకి సుధాకర్ మంగళవారం విడుదలైన సివిల్స్ ఫలితాల్లో 949 ర్యాంకు సాధించాడు. గ్రామానికి చెందిన రాంటేంకి సోమయ్య-ప్రమీల దంపతుల కుమారుడైన సుధాకర్ సిర్పూర్-టి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకు పాఠశాలలో ఐదో నుంచి పదో తరగతి వరకు చదివాడు. హైదరాబాద్ గురుకులంలో ఇంటర్, కారగ్‌పూర్‌లో ఐఐటీలో బీటెక్ పూర్తి చేశాడు. సివిల్స్ సాదించాలనే పట్టుదలతో హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ లోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో రెండేళ్ల పాటు ప్రిపేర్ అవుతున్నాడు. 949 ర్యాంకు సాధించడంతో పలువురు అభినందించారు.

పోలీసు కుటుంబాలకు అండగా నిలుస్తాం



చెక్కును అందజేస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పోలీసు కుటుంబాలకు అండగా నిలుస్తామని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల కాగజ్‌నగర్ టౌన్ పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న తిరుపతయ్య గత డిసెంబరు నెలలో గుండెపోటుతో మృతి చెందగా అతని సతీమరణి రాధికకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో భద్రత ఎక్స్‌గ్రేషియా రూ. 8,00,000, కార్పస్ ఫండ్ రూ.50,000, విండో ఫండ్ రూ.10,000 మొత్తం రూ.8,60,000 విలువ చేసే చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ కుటుంబ ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబానికి పోలీసు శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ప్రభుత్వ పరంగా అందాల్సిన ఇతర బెనిఫిట్‌లు తక్షణమే అందజేసే విధంగా చూస్తామని వారికి భరోసా ఇచ్చారు. పోలీసు సిబ్బంది కుటుంబ సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చడంతో పాటు కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ అంజన్న, జిల్లా పోలీసు కార్యాలయ ఏఓ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ వర్మ, సీసీ కిరణ్ పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలి

వాంకిడి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాస పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహిచాలని మండల ప్రత్యేకాధికారి రాథోడ్ బిక్కు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం రాజీవ్ యువ వికాస పథకంపై ఆర్థికంగా వెనకబడి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ యువతీ యువకులకు ఆయా కార్పొరేషన్‌ల ద్వారా ఆర్థిక సహాయం అందించేందుకు ఏర్పాటు చేసిన మండల స్థాయి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక ప్రభుత్వ విధి విధానాలకు అనుగుణం గా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఏపీఎం మహేష్, ఎస్‌బీఐ, టీజీబీ మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

తిర్యాణి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిన్నెధరి గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయ పడిన వృద్ధురాలు సిడాం భాగ్యలక్ష్మి(58) చికిత్స పొదుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. భాగ్యలక్ష్మి గిన్నెధరి గ్రామంలో జరిగిన వివాహ వేడుకకు హాజరై రోడ్డు దాటుతుండగా తిర్యాణి నుంచి గుడిపేట వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కొర్వేత లక్ష్మీపతి అతి వేగంగా వచ్చి ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడ్డ ఆమెను గిన్నెధరి ప్రాథమిక ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మంచిర్యాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

విద్యతోనే గౌరవం

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యతో గౌరవం సాధ్యమని జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డేను పురస్కరించుకుని ఐదు రోజులుగా కొనసాగుతున్న అటల్ టింకరింగ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ముగింపు కార్యక్రమంలో ఆయనప్రసం గించారు. ప్రతి విద్యార్థి విద్యార్థి దశ నుంచే నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. ఎనిమిది పాఠశాలల నుంచి శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు తాము ఈ శిక్షణలో నూతన విషయాలను నేర్చుకున్నామని వారి అభిప్రాయాలు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు దేవభూషణం, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణచారి, పాఠశాల కార్యదర్శి వేణుగోపాల్, సహ కార్యదర్శి మధుకర్, శికులు సాయికృష్ణ, శ్రీకాంత్, ప్రధానాచార్యులు కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వార్షిక ప్రణాళిక తయారు చేయాలి

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించిన వార్షిక ప్రణాళిక తయారు చేయాలని గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి అన్నారు. మంగళవారం పీఎంఆర్‌సీ కార్యాలయంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎస్‌సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థుల నమోదు సంఖ్య పెంచాలని, పాఠశాల గ్రాంటు నిధులు సద్వినియోగం చేసుకోవాలని తదితర విషయాలను చర్చించారు. కార్యక్రమంలో ఏసీఎంఓ ఉద్దవ్, జీసీడీఓ శకుంతల, ఏటీడీవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలి

దహెగాం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఇందరిమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారుల ను ఎంపిక చేయాలని మండల ప్రత్యేకాధికారి సజీవన్ అన్నారు. మంగళవార ఎంపీడీఓ ఆల్బర్ట్‌తో కలిసి రైతు వేదికలో ఇందిరమ్మ కమిటీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశం లో ఏఈలు ఇనోస్, ఆత్మారావు, ఏపీఎం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు నేలలు అనుకూలం

పెంచికలపేట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుకు ఈ నేలలు అనుకూలమని ఉద్యానవన డివిజన్ అధికారి సుప్రజ అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్లూర గ్రామ రెవెన్యూ శివారులో గన్నారం లో రైతు ఉమ్మడి శ్రీనివాస్‌రెడ్డి పొలంలో ఆయిల్‌పామ్ గెలల మొదటి పంట కోత పరిశీలించి సూచనలు చేశారు.